త్యాగమయి

భమిడిపాటి భాస్కర రామారావు

"అమ్మా! ఈ నాయనమ్మను ఎల్లకాలం మనమే ఎందుకు పోషించాలి?" తల్లి లత నడిగాడు కొడుకు శేఖరం.

నూనూగు మీసాల నూత్న యవ్వనంలో అప్పుడే అడుగిడుతున్న కొడుకు అలా అడిగేసరికి దిగ్భ్రాంతురాలయింది లత.

"ఎందుకేమిటి? ఆవిడ మీ నాన్నగారిని కన్నతల్లి కాబట్టి."

"కావచ్చు కాని ఆ నాన్న యిప్పుడు లేరు కదమ్మా! మనకేమిటి అవసరం? కాకపోయినా ఆవిడకు నాన్నగారు ఒక్కరే కాదు కదమ్మా కొడుకు. నాకు యింకా ఐదుగురు పెదతండ్రులున్నారు. నాకు కాస్త జ్ఞానం తెలిసిన దగ్గర నుండీ ఈవిడ వాళ్ళ దగ్గరకు వెళ్ళడం గాని, లేదా వాళ్ళు ఈవిడను కనీసం ఒక్కసారయినా తీసుకు వెళ్ళడం గాని ఎప్పుడూ జరగలేదే!

నీ రెక్కల కష్టంతో నన్నూ చెల్లాయినీ పోషించి చదివిస్తున్నావు తరువాత మనం చెల్లాయి పెళ్ళి కూడా చెయ్యాలి. అది ఫరవా లేదనుకో! ఎందుకంటే ఈ ఏటితో నా చదువు పూర్తవుతుంది. నే చదివిన చదువుకు ఉద్యోగం తప్పకుండా వస్తుంది. చెల్లాయి పెళ్ళి నేనే చెయ్యగలను."

కొడుకు ఆత్మవిశ్వాసంతో చెపుతున్న మాటలకు ఆ మాతృ హృదయం గర్వంతో ఉప్పొంగింది. కనిపించని దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటోందా అన్నట్టు కళ్ళు మూసుకుని ముఖం ఆకసం వైపుకు తిప్పింది లత.

అక్కడే ఓ మూలగా కూచుని ఉన్న నాయనమ్మ భద్రకాళి అయోమయంగా మనవడి వంకా, కోడలి వంకా మార్చి మార్చి చూస్తోంది. ఆవిడ ముఖంలో కొంచెంగా భయం తాలూకు ఛాయలు గోచరిస్తున్నాయి.

మౌనంగా కళ్ళు మూసుకుని ఉన్న తల్లి నుద్దేశించి, "ఏం అమ్మా! ఏమీ మాట్లాడ వేమిటి?" అని అడిగాడు శేఖరం

శేఖరం హెచ్చరింపుతో ఈ లోకంలో పడింది లత.

చటుక్కున కళ్ళు తెరిచి కొడుకు ముఖం వైపు చూచింది.

"నా ప్రశ్నకు నీ జవాబేమిటి?" అన్నట్టున్నాయి అతడి ముఖ భావాలు.

"నాన్నా! ఆ ప్రశ్నలన్నీ నీ కెందుకురా యిప్పుడు? నీ పెద్ద పరీక్షలు కూడా దగ్గర పడుతున్నాయా, పోయి చదువుకోకుండా!" బుజ్జగింపుగాను లాలింపుగాను అంది లత. ఆమె కనుకొలకులలో నీటి బిందువులు. అవి ఆనంద బాష్పాలో దుఃఖాశ్రువులో అర్థం కాలేదు శేఖరానికి.

"అమ్మా నిన్నెప్పుడు ఈ ప్రశ్న వేసినా ఇలాగే ఆకును అందకుండా పోకను పొందకుండా జవాబు చెబుతున్నావు. ఇవాళ అసలు సంగతి చెబితే గాని నిన్ను విడిచేది లేదు." మారాం చేస్తున్న చంటి పిల్లాడిలా అన్నాడు శేఖరం.

"ఏమిటి నీ మంకు పట్టు. ఆవిడ నీకు నాయనమ్మ. నాకు అత్తగారు. అంతే!" కాస్త కరుకుదనం ధ్వనించింది లత కంఠంలో.

మనుమడి ప్రశ్నలు వింటూ తన ముందు గతి ఏమవుతుందో అని భీతి చెందుతోంది భద్రకాళి. కాని కోడలి జవాబుతో ఆమె గుండె కుదుట పడింది.

"ఎందుకమ్మా ఆ మమకారం. ప్రాణానికి ప్రాణంలా చూచుకునే వాళ్ళ మీద మమకారం చూపించినా అర్థం ఉంది. లోకమూ హర్షిస్తుంది. ఇవాళ నువ్వు కష్టపడితే గాని మమ్మల్ని పోషించలేని స్థితికి కారణభూతురాలయిన నాయనమ్మ మీద ఎందుకమ్మా యింత అభిమానం. ఈవిడ కారణం గానే కదమ్మా మా నాన్నగారు మాకు లేకుండా పోయింది? ఎందుకమ్మా నన్ను మభ్యపెట్ట జూస్తావు."

కొడుకు మాటలకు నిశ్చేష్ఠురాలయింది లత.

"శేఖర్! ఏమిటి నువ్వు మాట్లాడుతున్నది?"

"నాన్నగారితో పాటు పని చేసి యిప్పుడు రిటయిరయిన ఓ పెద్దాయన నాకు నిన్న తటస్థ పడ్డారమ్మా. ఆయనా మనం పక్క పక్క వాటాలలో నే కొన్నాళ్ళ పాటు కాపురం కూడా చేశామట. ఆయన మన కథంతా వివరంగా చెప్పారమ్మా."

"ఎవరు? సూర్యనారాయణగారా? ఏమని చెప్పారు రా?" లత కంఠంలో ఆతృత. తాను ఏ విషయం అయితే కొడుక్కు తెలియకుండా పెంచాలని ప్రయత్నించిందో ఆ రహస్యం కొడుక్కు తెలిసిపోయిందన్న ఆవేదన.

"ఏం చెప్పార్రా కన్నా!"

"అంతా పూసగుచ్చినట్టు చెప్పారమ్మా! విను!"

* * * *

ఎర్రంచు తెల్ల చీర తెల్ల జాకెట్టు కట్టుకుని గదిలో అడుగు పెట్టింది లత. ఆమె నుదుట సింధూర తిలకం. తలలోని బొండు మల్లెల సువాసనలు గది నలుమూలలా వ్యాపిస్తున్నాయి. చేతిలో ని మంచి నీళ్ళ చెంబు టేబుల్ మీద పెట్టింది. భర్త అప్పటికే మంచం మీద పడుకుని ఉన్నాడు. లత మంచం వైపుగా నడిచింది.

కిరీటి ఆమె రాకతో మంచం మీద లేచి కూచుంటూ, "ఏమిటో యీ యివాళ విశేషం? అపర రతీదేవిలా మెరిసి పోతున్నావు. ఏమిటి కథ?" అంటూ మంచం దగ్గరగా వచ్చిన లతను భుజాలు పట్టుకుని తన పక్కన కూచుండబెట్టుకున్నాడు.

లత తమలపాకు చిలకలు భర్త నోటి కందిస్తూ, "మన శేఖరానికి తమ్ముడో చెల్లాయో పుట్ట బోతున్నారండీ!" అంది సిగ్గుగా తల వంచుకుంటూ.

ఆమె బుగ్గలు అరుణ రంజితాలయాయి. అధరాలు దరహాస చంద్రికలను వెదజల్లుతున్నాయి.

కిరీటి లతను దగ్గరగా తీసుకుని ఆమె బుగ్గ మీద సున్నితంగా చుంబించి, "ఎంత తియ్యని కబుర్లు చెప్పావు లతా!" అన్నాడు పారవశ్యంతో కన్నులు అరమోడ్పులు కాగా.

లత కిరీటి బాహు పంజరం నుండి విడిపించుకుంటూ, "ఏమండీ!" అంది.

"దేవిగారి కోరిక వెంటనే విన్నవించాలి. క్షణంలో కొండ మీది కోతిని తెమ్మన్నా తేవడానికి సిద్ధంగా ఉన్నాడీ దాసుడు." నవ్వుతూ అన్నాడు కిరీటి.

"కోతులూ అక్కరలేదు కొండముచ్చులూ అక్కరలేదు కాని చిన్న కోరికండి" అంది లత.

"ఆజ్ఞాపించవోయ్!"

"ఇంతటితో మనం సంతానానికి ఫుల్‌స్టాప్ పెడితే బాగుంటుంది కదండీ!"

"నీ ఆలోచన అమోఘం లతా! అమోఘం. అపరిమితమయిన సంతానానికి జన్మనిస్తే అన్నీ అవస్థలే! అదే పరిమిత సంతానం అయితే... ఓహ్! తల్లిదండ్రులకు వారి బిడ్డలకూ కూడా జీవితం నందన వనమే కదూ!" అని, "లతా! నువ్వు చెప్పినట్టే చేద్దాం. నేను వచ్చే నెలలో సెలవు పెట్టి వాసెక్టమీ చేయించుకుంటాను. సరేనా?" అన్నాడు కిరీటి ఉత్సాహంగా.

ఆనందంతో తలమునకలయింది లత. కిరీటిని బాహు వల్లరిలో బంధించి అతడి ముఖం ముద్దులతో నింపి వెయ్యసాగింది.

భడాలున గది తలుపు తెరుచుకుంది.

ఆ చప్పుడుకు బిత్తరపోయిన లత భర్త బాహు బంధం నుండి దూరమయింది. తెరచుకున్న తలుపులకు మధ్య భద్రకాళి!

అలాటి రసవత్తర ఘట్టంలో అత్తగారు అలా గదిలోకి చొరబడడంతో బిక్కచచ్చిపోయింది లత.

తల్లి ప్రవర్తనకు మనసుకు కష్టం తోచిన కిరీటి, "ఏమిటమ్మా..." అని ఇంకా ఏమో అడగబోతున్నాడు.

అతడి నోటి నుండి ఇంకా మాట ఊడి పడలేదు.

"ఒరేయ్ ఒరేయ్! నీ అఘాయిత్యం కూలా! పిల్లలు పుట్టకుండా ఆపరేషను చేయించుకుంటా వటగా! మీ నాన్నగారు కూడా నీలాగే ఆలోచించి ఉంటే నువ్వసలు పుట్టే వాడివేనటరా! హవ్వ! హవ్వ!" అంది భద్రకాళి.

తల్లిదండ్రులకు కిరీటి ఆరవ కొడుకు. తొమ్మిదో సంతానం.

"అమ్మా! ఆ నాటికి ఈ నాటికీ కాలంలో ఎంతో మార్పు వచ్చింది. అలాగే సమాజంలో కూడా. ఆ నాడు మీరు ఎక్కువ మంది సంతతిని కన్నారు. దాని వల్ల ఒరిగిందేమిటి? మా అన్నదమ్ములందరికీ సామాన్యమైన చదువులు చెప్పించడమే కష్టమైంది. అక్కల నిమిత్తం అయినింటి వరుల్ని తేవడమే గగనమైంది."

"ఓరి నీ నోరు పడ! ఎంత మాటన్నావురా! అక్కడికి మీ నాన్నగారు మీకేదో తక్కువ చేసినట్లు మాట్లాడడానికి సిగ్గు లేదురా!" అంది భద్రకాళి.

"అమ్మా! నువ్వు నన్ను అపార్థం చేసుకుంటు న్నావు. అవి ఆ రోజులు కావడం చేతనే మావి సామాన్యమైన చదువులైనా గౌరవంగా బ్రతికే ఉద్యోగాలు వచ్చాయి. హాయిగా బ్రతుకుతున్నాం. కాని యిప్పుడు కాలం మారిందమ్మా! ఇప్పుడు పెద్ద పెద్ద చదువులు చదివినవారికే సరియైన ఉద్యోగాలు దొరకటంలేదు. ఇక సామాన్యమైన చదువులే అయితే చెప్పేదేం ఉంది. మన ఆర్థిక స్థితిగతుల్ని బట్టి పరిమిత సంతానం అయితేనే పిల్లల భవిష్యత్తుకు ఇబ్బంది లేని చదువులు చెప్పించగలుగుతాం. పైగా, అమ్మా! ఆ నాడు ఆడపిల్లలకు చదువుతో నిమిత్తం ఉండేది గాదు. మరి నేడో? కనీసం గ్రాడ్యుయేట్ అయినా కాని పిల్లను ఏ వరుడూ చూడడానికి కూడా యిష్టపడడం లేదు. అందుచేత నన్నర్థం చేసుకోవమ్మా!" అర్థింపుగా అన్నాడు కిరీటి.

"అయినా నిన్నని లాభం ఏమిటిలే! ఏదో చదువుకున్న పిల్ల కావాలని ఉబలాట పడ్డావు కదా అని నీ యిష్ట ప్రకారమే చేశాం...."

పెళ్ళినాటికి లత పదో తరగతి పాసయింది. పెళ్ళయ్యాక ఇంటరు కూడా ప్రయివేట్‌గా కట్టి పాసయింది. కాని అత్తగారి పోరు అధికం కావడంతో చదువు అంతటితో ముగించవలసి వచ్చింది.

"... అదేదో ఇంటరు కూడా వెలగ బెట్టిందిగా! ఆ తిప్పుల భామక్కనే అనాలి. ఒరేయ్ వాజమ్మా! అలా పెళ్ళాం మాట కల్లా తాన తందానా అనకూడదురా."

"అమ్మా! అలా దాని మీద ఏరుచుకు పడతా వెందుకు?"

"అబ్బో సంబడం! లోకంలో వీడి కొక్కడికే ఉందండీ పెళ్ళాం! ఏడు మల్లె పువ్వులెత్తుగా

చూస్తున్నావు కదూ! అంచేత మరీ అడిస్తుందిలే!" అని, "ఒరేయ్! ఇదిగో చెబుతున్నాను. అపరేషనూ గీపరేషనూ అన్నావంటే యిక నువ్వు నన్ను ప్రాణంతో చూడవ్. ఏమనుకుంటున్నావో!"

"అమ్మా! అఘాయిత్యం మాట లాడకు. నేనెందుకు చెబుతున్నానో విను."

"ఒరేయ్! అపరేషను చేయించుకుంటా నంటున్నావు. బాగానే ఉంది. ఒక వేళ కర్మ కాలి రేపు అది కనలేక చచ్చిందనుకో. ఇక నీకు పిల్ల నెవరిస్తార్రా?"

లత మనస్సు ఉండేలు దెబ్బ తిన్న పిట్టలా గిలగిల లాడింది అత్త మాటలకు.

"శుభం పలకరా పెళ్ళికొడకా అంటే... అన్న సామెతలా ఏమిటా మాటలు?" తల్లిని ఉద్దేశించి కటువుగా అన్నాడు కిరీటి.

"అంతే! నా మాటకు యిక తిరుగులేదు. అంతగా యిక పిల్లలు వద్దనుకుంటావా రేపు కాన్పు సమయంలో దానికి చేయించు అపరేషను. అంతే కాని నువ్వు చేయించుకుందుకు ఎంత మాత్రం వీలులేదు. నా మాట కాదన్నావో నువ్వు చూసేది నీ తల్లి శవాన్ని మాత్రమే!" అని బయటకు వెళ్ళిపోయింది భద్రకాళి.

లతా, కిరీటి – ఇద్దరూ చేష్టలుడిగిపోయిన వాళ్ళలా కూర్చుండిపోయారు.

ముందుగా లతే తేరుకుంది. "విన్నారుగా అత్తగారి మాటలు" అంది.

"హుం! విన్నాను. ఏళ్ళు ముదిరే కొలదీ మూర్ఖత్వం పెరిగిపోతోంది. ఈవిడ గారి మాటలను పట్టుకు కూచుంటే ఇక బతుకు తెల్లారినట్టే."

"అంటే, ఏమయినా మీరు అపరేషను చేయించుకుందుకే నిశ్చయించుకున్నారా?"

"ముమ్మాటికీ."

"ఆవిడ అసలే పట్టుదల 'మనిషి. ఆ విషయం మీకూ తెలుసు. అన్నంత పనీ చేసినా చెయ్యగలరు."

"అయితే ఏమిటంటావ్? అపరేషన్ చేయించు కోవడం మానేసి అద్దూ అపూ లేకుండా పిల్లలను కంటూ పోదామా? ఒక్క బిడ్డకూ కడుపు నిండా తిండీ, ఒంటి నిండా బట్టా లేని అభాగ్యులుగా చేసి వాళ్ళను చూస్తూ అలో లక్ష్మణా అని ఏడుస్తూ కూచుందామా?" ముఖం ఎర్రగా చేసుకుని కోపంగా అడిగాడు కిరీటి.

లత చిరునవ్వు నవ్వి, "ఎందుకండీ అంత కోపం. అత్తగారు మిమ్మల్ని అపరేషను చేయించుకో వద్దన్నారే గాని నాకేం ఆంక్ష విధించలేదు కదా? రేపు పురుడయ్యాక అపరేషను నాకు చేయిద్దురు గాని. ఏం?" అంది లత.

"లతా! మగవాళ్ళ అపరేషను చాలా సులువు. పైగా ఏ యిబ్బందులూ ఉండవు. అదే ఆడవాళ్ళకయితే ... కొన్నాళ్ళ పాటు ఏ పనీ చేయకుండా ఉండాలి. బాగా విశ్రాంతి ఉండాలి. మా అమ్మ ఒంట్లో ఓపిక ఉన్నా యిప్పటికే ఇంటిడు చాకిరీ నీ నెత్తినే రుద్దుతోందా? రేపు మధ్యన చంటి బిడ్డ అద్దు ఒకటి ఉంటుందాయె. అటు యింటి పనీ, ఇటు బిడ్డ ఆలనాపాలనా మధ్య నీకు విశ్రాంతికి అవకాశం అసలే ఉండదు. ఆరోగ్యం పాడయిందంటే తిరిగి దారిలో పడడం కష్టం." అన్నాడు కిరీటి.

"ఫరవాలేదు లెండి. పెద్దావిడ. ఆవిడకు మాత్రం తెలియదా? పరిస్థితి ఎరిగి పనిలో ఆవిడే సాయం చేస్తారు."

లత మాటలకు , బలవంతాన అంగీక రించాడు కిరీటి.

లతకు నవమాసాలూ నిండాయి. అందాల జాబిల్లిని పరిహసించేటంత అందంతో ఆడపిల్ల పుట్టింది. కలిగిన సంతతి యిద్దరే అయినా ఒకరు మగ మరొకరు ఆడ కావడంతో లతా కిరీటుల ఆనందానికి అవధులు లేకపోయాయి. ఆ ఆనందంలో అపరేషను తాలూకు బాధా, కష్టము కూడా మరచిపోయింది లత.

అక్కడ నుండి మొదలయ్యాయి అసలు కష్టాలు.

కిరీటి ఇంటి దగ్గర ఉన్నంత సేపూ లత చేత కనీసం కాఫీ కూడా కాచ నిచ్చేది కాదు భద్రకాళి. కిరీటి అలా ఆఫీసుకు వెళ్ళడం తరువాయి మొదలు పెట్టేది సాధింపులు.

ఓపికలేక లత లేవలేకపోతే పిల్లి మీద ఎలక మీద పెట్టి మంగళాష్టకాలు మొదలు పెట్టేది భద్రకాళి.

భర్తకు చెప్పుకుందుకు బిడియం అడ్డు వచ్చేది లతకు. ఓపిక లేకపోయినా మాటలు పడడం యిష్టం లేక అడ్డమైన చాకిరీకి నడ్డి వంచేది.

దానితో లత ఆరోగ్యం దెబ్బతింది. కిరీటికి లత అంటే ఆరవప్రాణం. డాక్టరును తీసుకు వచ్చాడు.

డాక్టరు ప్రిస్క్రిప్షను రాస్తూ, "చూడండి కిరీటిగారూ! మీ మిసెస్‌కు విశ్రాంతి ముఖ్యం. విశ్రాంతి అనేది ఉంటే యిప్పుడు నేను రాసిన మందులే అక్కరలేదు. అదే విశ్రాంతి కరువైన నాడు ఎన్ని మందులు తిన్నా ఫలితం మాత్రం శూన్యం". అన్నాడు.

అసలు విశ్రాంతి మాటే మరచి శరీరం అలిసి పోయేలా చాకిరీతో మునిగి పోతున్నావని లత మీద విసుక్కున్నాడు కిరీటి ఓ రోజు.

లత యింకా జవాబు చెప్పనే లేదు. మధ్యలో భద్రకాళి కలగ జేసుకుని, "చూడు తల్లీ! నీ మొగుడు నేను నీ చేత ఏదో అడ్డమైన చాకిరీ చేయించేస్తున్నానని ఎగిరెగిరి పడు తున్నాడు. నువ్వేమో నంగనాచిలా ఏమి మాట్లాడవు". అని సాగదీసింది.

లత అప్పుడూ ఏమీ మాట్లాడలేదు.

భద్రకాళి తిరిగి అందుకుని, "అవున్లే నువ్వెందుకు మాట్లాడతావు. నాలిముచ్చులా నీ మొగుడి చేత నాలుగు మాటలూ నన్నే అనిపిస్తావు" – చేతులు తిప్పుకుంటూ అంది.

"అమ్మా! ఎందుకనవసరంగా నోరు పారేసు కుంటావు? అది యిప్పుడేమైనా అందా? దానిని విశ్రాంతి తీసుకోమని మందలించ వలసింది పోయి సూటీ పోటీ మాటలెందుకే?" అంత వరకూ భద్రకాళి జాణ తనానికి మూగ సాక్షిలా నిలబడి ఉన్న కిరీటి అన్నాడు.

దానితో భద్రకాళికోపం తారస్థాయి నందుకుంది. "అనరా నాయనా అను. అందుకేరా పెళ్ళాం బెల్లంముక్క అని పెద్ద ముండా కొడుకులన్నది!" అంది.

లత గుడ్ల నీరు కుక్కుకోవడం మినహా మరేమీ చేయలేక పోయింది.

తల్లిని అంతకన్నా మరేమీ అనలేక కిరీటి విసుక్కుంటూ బయటకు వెళ్ళాడు.

ఒకనాడు –

ఆఫీసు తాళాలు కూడా తీసుకు వెళ్ళడం మరచి పోయిన కిరీటి వెళ్ళిన గంటలోనే తిరిగి యింటికి వచ్చాడు.

గుమ్మంలో అడుగు పెట్టే సరికి చంటి బిడ్డ చంద్రకళ గుక్క పట్టి ఏడుస్తోంది. కిరీటి లోపలకు



వచ్చేసరికి చిన్నారి శేఖరం చెల్లిని ఊరుకో పెట్టడానికి తన చిన్ని బుర్రకు తోచిన ప్రతీ ప్రయత్నమూ చేస్తున్నాడు.

హాల్లో ఓ మూలగా కూచుని ఉంది భద్రకాళి. చంటిబిడ్డ, అందునా తన మనుమరాలు అంతగా గుక్క పట్టి ఏడుస్తున్నా ఆమెకు చీమకుట్టినంత బాధ కూడా వున్నట్టు కనిపించడం లేదు.

కిరీటికి తల్లి మీద భార్య మీద కూడా కోపం ఉప్పెన కెరటంలా తోసుకొచ్చింది.

"లతా!!!" ఇల్లెగిరి పోయేలా కేకపెట్టాడు కిరీటి.

కిరీటి మూడవ మారు పిలవ బోతుండగా ఇంటి వెనుక భాగం నుండి, "వస్తున్నానండీ!" అన్న లత కంఠం వినిపించింది. ఆ స్వరం చాలా నీరసంగా ఉంది.

మెల్లగా తడబడుతున్న అడుగులతో లోపలకు వచ్చింది లత. ఆమె ముంగురులు చెదిరి ఉన్నాయి. బొట్టు చెమటకు నాని నుదుటి నుండి ముక్కు మీదుగా క్రిందకు కారు తోంది. అంట్లగిన్నెలు తోముతోందన్నందుకు గుర్తుగా రెండు అరి చేతులూ మసిపట్టి ఉన్నాయి. కట్టిన కోక మీద కూడా అక్కడ అక్కడ మసి మరకలు.

ఆమెను చూచి, "లతా! ఏమిటి నువ్వు చేస్తున్న పని?" కోపంగా అడిగాడు కిరీటి.

లత మాట్లాడలేదు. నేల చూపులు చూస్తోంది.

"లతా! నువ్వు విశ్రాంతి తీసుకుంటేనే గాని తినే మందుల వల్ల ప్రయోజనం ఉంటదని డాక్టరుగారు చెప్పలేదూ?" ఆర్ద్రంగా అడిగాడు కిరీటి.

లత కంటిచెంట నీరు ధారలుగా కారింది.

"చిత్రాంగి! అత్త ఆరడి పెడుతోందని లోకం అంతా చాటడానికి". సాగదీసుకుంటూ అంది భద్రకాళి.

తల్లి మాటలకు చిర్రెత్తు కొచ్చింది కిరీటికి.

"అమ్మా! అలా మాట్లాడక పోతే నువ్వు అర్థం వెళ్ళి లత చేత కొంతకాలం పాటు ఏపనీ చేయడానికి వీలులేదని చెప్పి ఉంటే?" అన్నాడు కిరీటి.

"నే చెబితే వింటేకదు నాయనా! అత్త ముండను అరడి పెట్టాలని కాకపోతేనూ!"

"మాట మాట్లాడితే యిదీ తంతు నీతో. నువ్వు పని చేయడానికి వీల్లేదని గదమాయిస్తే లత పని చేయడానికి సాహసిస్తుందా? పోనీ, చంటి ముండ గుక్క పట్టి ఏడుస్తోంది కదా! అది నీ మనుమరాలే కదా! ఆగుంట వెధవ తంటాలు పడుతున్నాడు గాని నువ్వు ఓ సారి దానిని సముదాయించలేవూ? నువ్వు మాత్రం తల్లివి కావా?" అని తల్లిని గదమా యించాడు కిరీటి.

దానితో భద్రకాళి రుద్రకాళే అయింది. చెట్టంత కొడుకును పట్టుకుని పెళ్ళాం కొంగు పట్టుకు తిరిగే వాజమ్మ వంది. ఇంకా ఏమేమో అనరాని మాట లంది.

ఆవిడ మాటలతో కిరీటి మనస్సు వికల మయింది. లతనే మరిరెండు కేకలేసి తాళాలు తీసుకుని స్కూటరెక్కాడు. ఇంటి దగ్గర జరిగిన రగడతో అన్య మనస్కంగా స్కూటరు నడుపు తున్నాడు.

ఆఫీసుకు వెళ్ళే సందులోకి స్కూటరు తిప్పాడు.

అప్పటికే పెనుభూతంలా వేగంగా వస్తోంది లారీ. చివరిక్షణంలో ఆపద గ్రహించిన కిరీటి బ్రేకు వేద్దామని చేసిన ప్రయత్నం ఫలించలేదు.

స్కూటరు లారీ ముందు చక్రాల క్రిందకు దూరి పోయింది.

ఆఫీసు నుండి కిరీటి సహ ఉద్యోగులు పంపిన వార్త అందుకుని ఆదరాబాదరా హాస్పిటలుకు చేరుకుంది లత.

ఆమెకు దక్కినది చివరి చూపు మాత్రమే!

కిరీటి ఆమెకు ఏదో చెప్పాలని ప్రయత్నించాడు. కాని నోట మాటరాలేదు. అతడి కళ్ళ వెంట కన్నీటి ధారలు మాత్రమే రాలి పడ్డాయి.

కర్మకాండలకు కిరీటి అన్నలూ, అక్కలూ అందరూ వచ్చారు. అన్నీ సక్రమంగా పూర్తయి ఎవరి దారిన వారు వెళ్ళబో తున్నారు.

దిక్కుదివాసులేని లతకు భద్రకాళి బరువును వదల్చాలనే ఔదార్యం మాత్రం ఎవరి లోనూ చోటు చేసుకోలేదు.

తన భర్త బ్రతికి ఉన్నప్పుడు తనను కాల్చుకు తింది అత్తగారు. కాని ఈనాడు ఏ కొడుకూ ఆమె ఊసు ఎత్తడం లేదు. జాలిగా లత వైపే చూస్తుండి పోయింది భద్రకాళి. లత మనసు ఆర్ద్రమైంది.

పూర్వం అత్త అభీష్టానికి వ్యతిరేకంగా అయినా తాను చదివిన ఇంటర్మీడియట్ సర్టిఫికెట్టు దారీ తెన్నూ కనిపించని ఆ సమయంలో లత పాలిటి వెలుగు రేఖ అయింది.

భర్త పని చేసిన ఆఫీసులో ఆమెకు ఉద్యోగం దొరికింది.

* * * * *

"ఆనాడు గుండె రాయి చేసుకుని ఉద్యోగంలో చేరబట్టి కదా నన్నీ స్థితికి తేగలిగావు. జీవితం అంతా బాధామయం చేసిన నాయనమ్మ మీద నీకెందుకమ్మా జాలి". అడిగాడు శేఖరం.

"నాయనా! ప్రతీ తల్లీ తన కొడుకు జీవితాంతమూ తన చెప్పు చేతల్లోనే ఉండాలని కోరుకుంటుంది. పెళ్ళయ్యాక అతడి జీవితంలో మార్పు వస్తుందని, దానికి అనుగుణంగా తానూ నడుచుకో వలసి ఉంటుందని గ్రహించదు."

"పెదతండ్రులు ఎవరూ మోయసిద్ధ పడని ఈ భారం మనమే ఎందుకు మోయాలమ్మా?"

"ఆ భారం మీ నాన్నగారు మోశారు. అది నేను అందుకోవలసి వచ్చింది. ఇక ఆవిడ చివరిక్షణం వరకూ నువ్వు మోయాలి". స్థిరంగా చెప్పింది లత.

మనుమడు మాటాడిన తీరు విన్న భద్రకాళి అప్పటికే ఓ చేతి సంచిలో తన చీరలు రెండూ కుక్కుకుని ప్రయాణం అవడానికి సిద్ధమయి అక్కడకు వచ్చింది.

లత అది చూచి, "అదేమిటత్తయ్యా!" అని అడిగింది.

"అమ్మా లతా! బ్రతి కుంది యిన్నాళ్ళూ నిన్ను బాధలు పెట్టి నీ బ్రతుకు బండలు పాలు చేశాను.



అయినా నువ్వు నన్నెప్పుడూ పల్లెత్తు మాట అనలేదు. నీ కొడుకూ ప్రాజ్ఞుడయ్యాడు. నువ్వు యిక నుండి వాడి మాట ప్రకారం నడుచు కోవడం న్యాయం. నన్ను పోనీయి" అంది

శేఖర్ పకపకా నవ్వి, "భలే నాయనమ్మా! భలే! అరవయి ఏళ్ళకు అక్కుంభట్టు అటకెక్కాడన్నట్టు ఇప్పుడొచ్చిందా నీకు పశ్చాత్తాపం? ఎక్కడికి వెడదామని నీ ప్రయాణం?

కన్ను ఆనదు. కాలు ఆడదు.

నిన్ను మా అమ్మ ఏమీ పొమ్మన లేదుకదా!

నాయనమ్మా! ఊరు నిన్ను పొమ్మనే దాకా ఓ మూల కూర్చుని కృష్ణా రామా అని జపం చెయ్యి.

కనీసం ఈ వయసులో నయినా నువ్వు చేసిన పనులకు పశ్చాత్తాపం పడు". అన్నాడు శేఖర్ ఎగతాళిగా.

"తప్పు నాయనా! ఎన్ని అనుకున్నా ఆవిడ నీకు నాయనమ్మ". అంది లత కొడుకుతో మందలింపుగా. □